# రిరంసువు

మొట్ట మొదట భార్యా భర్తా వొచ్చారేమో ననుకొన్నాను. కానీ జానకి వొక్కతే వొచ్చిందనీ వెంకట్రావు రానేలేదనీ తరవాత తెలిసింది. జానకి వొచ్చి దాదాపు మూడువారాలు కావస్తున్నది. చేస్తున్న కాపరాన్ని వొదిలి ఇంతకాలం పుట్టింట్లో ఎందుకు వున్నదో నాకు తెలియదు. వెంకట్రావు-జానకి భర్త అయినప్పటినుండి నాకు తెలుసు. చాలా మంచివాడు, దాపరికంలేని వాడూను. పదినిమిషాల్లో మనలో కలిసిపోతాడు. అటువంటి వాడు భార్యతో పోట్లాడి, వెళ్ళగొడతాడని నేనెప్పుడూ అనుకోలేదు. పోతే జానకే అతని మనస్సు నొప్పించేట్టు ప్రవర్తించిందేమో? దాన్ని సహించలేక అతను దండించే వుండొచ్చు. ఈ విషయంలో ఎవరిదీ తప్పు కాదు! జానకి చదువుకొన్నది. కొద్దో గొప్పో ప్రపంచజ్ఞానం వున్నమనిషి. మరొకవ్యక్తికోసం; అతను భర్తేకావొచ్చు-వ్యక్తిత్వాన్ని చప్పున చంపుకో గలది కాదు. మరి...ఏదీ ఏమయినా ఎదురింటి వారమ్మాయిని గురించి నేను ఇట్లా ఆలోచించటం అనవసరం...

కాస్తోకూస్తో బుద్ధిమంతుడేనని వూళ్ళో నాకు పేరుంది. మరి నా యదార్థ జీవితం తెలియకనో, తెలిసిగూడా బయటపెట్టటానికి భయపడో, నన్ను ఉత్తమ పురుషునిగా లెఖ్ఖలో వేసుకొని, అయాచితంగా, నాకు సముచితమైన సాంఘిక విలువను, ఈ సంఘీయులంతా ప్రసాదించారు. ఇటువంటి బాపతు గౌరవాలంటే నాకు బొత్తిగా యిష్టంలేని మాట నిజం. కానీ కోరకుండానే లభించిన ఈ సంపత్తిని ఎట్లా వొదులుకోను?

మనసులో అనుకొన్నందువల్ల, సాధారణంగా ప్రమాదాలేవీ జరగటానికి వీల్లేదు. మనస్సులోని ఆలోచనలను పైకి చూపించగల సాధనాలేవీ ఇంకా కనిపెట్టబడ లేదు గూడాను. కానీ ఒక వ్యక్తియొక్క ప్రవర్తనను బట్టీ, మాటలను బట్టీ, అతని మనస్సులోని ఆలోచనలను చూచాయగానైనా గ్రహించవచ్చు. ఇది ఎవ్వరూ, ఎప్పుడూ దాటలేని చిక్కు. శతవిధాల అంత

వరకూ పరిస్థితులు రాకుండానే జాగ్రత్త పడగలను. మాటల సందర్భంలో, పొరబాటున జానకి విషయంగానీ ఎక్కడన్నా తెచ్చానంటే కొంప మునిగి పోగలదు....

అయినా కన్ను పోయేటంత కాటుకెందుకు? ఈ సిద్ధాంతంతోనే జానకిని గురించిన ఆలోచనలను నాలోనుండి పారద్రోల సాగాను. కానీ విచిత్రమేమిటంటే, నా ప్రయత్నమేమీ ఫలించటం లేదు. ఎంత త్వరగా నేను జానకికి సంబంధించిన ఊహలనుండి బైటపడ చూస్తున్నానో, అంత బిగ్గిరిగా నన్ను అలుముకోసాగినై. స్మృతిజగత్తునుండి, జానకిరూపాన్ని, సమూలంగా తుడిచివెయ్య వలెనని, నేను ప్రయత్నించిన కొద్దీ, ఆ రూపం మరింత అందంగా, గొప్పగా, దగ్గరగా నాలో పలుకుతోంది. ఇది అచ్చగా నా తప్పేనని నేను అంగీకరించను. దీనిలో జానకికి కూడా భాగముంది.

అయితే ఈ విషయాన్ని జానకి అంగీకరించకపోవచ్చు. అంగీకరిస్తుందనే నమ్మకం కూడా నాకు లేదు. తన చేష్టలకు మరొక అర్థాన్ని ఆమె ప్రతిపాదించవచ్చు. స్త్రీగా జన్మించిన కారణాన, ఆమెకా హక్కును సంఘం బహిరంగంగా ఆమోదించింది. ఆమె ప్రవర్తన ఏవేవో మధుర స్మృతులను చైతన్య స్రవంతిలో ఊయలాడించవచ్చు. వయసులో ఉన్న పురుషుడు ఆ ప్రవర్తన నాధారం చేసుకుని, వివిధ విధాలుగా ఆలోచించనూవచ్చు. అటువంటి అవకాశాలు విరివిగా ఆమెలో లభిస్తాయి. కానీ...దురదృష్టవశాత్తూ—అవును—నే ననుకొన్నవి కాకపోతే నా గతేమిటి? నేను భాష్యీకరించుకున్న పద్ధతిలో, ఆమె ప్రవర్తనకు, సమాధానమైన విధంగా ప్రవర్తించితే కలిగే విష ఫలితాల మాటేమిటి? కాలం కలిసివస్తే సరేసరి! స్వర్గసీమల్లోని, అవాచ్యానందాన్ని రుచి చూడవచ్చు. మందాకినీ భంగమృదు కలవరంలోని, గాంధర్వం వింటూ, శ్రవణమస్పృణమైన ఆధ్వన్య వాహినిలో లీనమవుతో భౌతిక ప్రపంచ ప్రభావానికి దూరమయి, లోకోత్తర సౌందర్య లోకాల్లోకి పోయే మహాకవి పొందగల అనూహ్య ఆనంద సీమల్లోకీ చేరవచ్చు. అది అదృష్టంమీద ఆధారపడ్డ సంగతి. నే ననేది కాలం ఎదు తిరిగి తన్నితే...?

జానకి తల్లి విషయం నాకు తెలుసు. ఒక్కగానొక్క కూతురు. అతి గారాబంగా పెంచింది; తండ్రి లేడనే లోటును ఏ విషమ పరిస్థితిలోనూ

లేకుండా. మరి—తిండికీ గుడ్డకూ ఏ విధమైన లోపమూ రానంత ఆస్తి. ఉత్తరోత్తరా ఆ ఆస్తికి యజమానురాలు జానకే. చదువుకునే రోజులనుండీ జానకి వంటిమీద ఈగను వాలనిచ్చేది కాదు. అంత మురిపెంతో పెంచింది. తనకున్న సాధన సంపత్తులతో ఆమె నన్ను ఏమయినా చెయ్యగల సమర్థురాలు...అయినా ఇవన్నీ నా కనవసరం. పుట్టింటికి ఏదో పనివుండి వచ్చి పది రోజులు గడుపుకు పోయే జానకిని గురించి ఇంత దీర్ఘంగా ఆలోచించడం కేవలం బుద్ధి తక్కువ. ఈ ఉద్దేశంతోనే, నేను జానకిని గురించి ఊహా సౌధాలు నిర్మించే కార్యక్రమాన్ని సమాప్తం చెయ్యటానికి వివిధ వ్యాపకాల మీదికి మనస్సును కేంద్రీకరించే పనిలో నిమగ్నుణ్నయ్యాను.

నే నెప్పుడూ అనుకోలేదు. అయితే అనుకోదగ్గ ఆధారాలూ లేకపోలేదు. ఆ ఆధారాల నాధారం చేసుకుని, తెలివిగా పురోగమించితే వీపు చెడుతుందనే బుద్ధితో మాత్రమే మానుకున్నాను. నిజానికి ఇదంతగా చెప్పదగ్గ సంఘటన కాకపోవచ్చు. లోకంలో ఇటువంటివి సర్వసాధారణంగా జరుగుతాయన్నా నేను కాదనను. కాని ఈ పరిస్థితుల్లో నా బుద్ధికి మాత్రం ఇది విచిత్రంగానే వుంది. కొన్ని క్షణాలపాటు, ఈ జరుగుతున్నది యదార్థ జగత్తులోనో, స్వప్న జగత్తులోనో కూడా నిర్ధారించుకోలేక పోయాను. నే నింకా ఏ నిర్ణయానికీ రాకముందే, జానకే నన్ను ముందుగా పలకరించి, ఇది భ్రమాజనిత స్థితి కాదనీ, యదార్థ లోకంలో యదార్థంగా జరుగుతున్నదేననీ, ససాక్ష్యంగా రుజువు చేసింది. సంభ్రమాశ్చర్యంవల్ల కలిగిన విచిత్ర స్థితిలో నేను జానకిని గౌరవించాలన్న విషయం కూడా మరిచిపోయాను. నా సమాధానం కోసం ఎదురు చూడకుండా జానకే ఒక కుర్చీని లాక్కుని కూచుంది.

"ఇంట్లో ఎవరూ లేనట్టుగా ఉన్నదేమండీ?"

ఇదీ ఆమె నాతో మాట్లాడిన మొట్టమొదటి మాట. ఈ ప్రశ్న లాంఛన ప్రాయంగా వేయటంతప్ప, నిజం ఆమెకు తెలిసే ఉంటుందని నేను ఊహించాను. ఎదురు బొదురుగా ఉన్న యిల్లు. మా యింట్లోవాళ్ళు వారికీ వారింట్లో మనుషులు మాకూ, ఎప్పుడూ కనిపిస్తూనే ఉంటారు. ఆమె వచ్చి దాదాపు మూడు వారాలు కావస్తోంది. ఇంట్లో ఉంటే, అంత కాలంలోనూ ఏ ఒక్క క్షణంలోనయినా కనిపించకుండా ఉంటారని నే నెట్లా అనుకోను?

కానీ తెలిసీ అడుగుతున్నదేననే దాని పరిణామాన్ని గురించి చివరకు ధైర్యంగా ఆలోచించనన్నా లేకపోయాను.

"మా అమ్మకు జబ్బు చేసింది."

"అయ్యో పాపం !"

"పుట్టింటి దగ్గర మందు తింటోంది. నాన్న, చెల్లెలు కూడా అక్కడే ఉన్నారు" అన్నాను.

"అందరి విషయమూ చెప్పారుగానీ అసలు సంగతి చెప్పలేదేమండీ ! అమ్మో అసాధ్యులే..." నవ్వింది.

"అసలెవరు ?" అన్నాను ఆశ్చర్యంతో. నాకు తెలిసినంతవరకూ మా కుటుంబంలో మేము నలుగురమూ తప్ప ఇంకెవరూ లేరు.

"మీ భార్య ! ఇంట్లో ఉందా ? పిలుస్తాను. ఇదిగో ఏమండీ... అన్నట్లు మీ భార్య పేరేమిటండీ !" అన్నది జానకి. ఇంటోకి గొంతు సాచి, నా భార్యను పిలుస్తున్నదల్లా, మధ్యలో ఆగి నా వేపు చూచి.

"భార్యేమిటి ? ఎవరూ లేరు."

"ఊఁ పోదురూ అన్నీ దొంగ మాటలు. నేను చూసిపోతానని గావును. అవునా ?"

"చూసినందువల్ల ప్రమాదం జరగదు. నిరభ్యంతరంగా చూడొచ్చు. కాని అది ఉంటేగదా ? నువ్వు చూడటం ?"

"ఎక్కడికి వెళ్ళిందీ ?"

"ఇంకా కాపరానికి రాలేదు."

"నిజంగానండి ? ఎందుకని ?"

"ఆ విషయం మేడూరి మల్లయ్యగారి నడిగితే తెలుస్తుంది."

జానకి ఆ విషయమై తర్వాత ఏమీ మాట్లాడలేదు. ఇదంతా కావాలని జానకి చేస్తున్న పని, అని నా అభిప్రాయం. ఇంత సామీప్యంలో, ఇంత కాలంనుండీ ఉంటూ కూడా, ఈ విషయాలేమీ ఆమెకు తెలియవనుకో డానికి, నమ్మకమైన ఆధారాలేమీ లేవు. అంతగా అవసరముంటే ఆమె తల్లి

నడిగి తెలుసుకోవచ్చు. నా యింటికి వచ్చి, నన్నే అడగటమనేది, కేవలం మామూలు సంగతని నేను అనుకోలేను.

"మరి మీ భోజనం ?"

"హోటల్లో తింటున్నాను."

జానకి ఏదో అనబోతూ వుంది. ఇంతలోకే బైటనుండి జానకి తల్లి కేక వినబడింది.

"ఆఁ వస్తున్నానే... పుస్తకం తీసుకుని" అని తల్లికి జవాబిచ్చి నా వేపు తిరిగి, "ఏమండీ! ఏదన్నా పుస్తకం ఒకటివ్వండి... బొత్తిగా ఏమీ తోచటల్లేదు" అన్నది జానకి.

"ఏంగావాలి ? కావలిసినదేమిటో నువ్వే వెదికి తీసుకో. అదిగో ఆల్ మైరా."

జానకి పుస్తకాల దగ్గిరికెళ్ళి, వెదికి వెదికి ఒక పుస్తకం తీసి, "ఇది బావుంటుందా ?" అన్నది.

"ఏమిటది ? దివ్యంగా వుంటుంది. చదువు."

"సాయంత్రం తెచ్చిస్తాను."

జానకి వెళ్ళిపోయింది.

ఇది నే నేనాడూ ఊహించని సంఘటన. యిదివరకు అనేక వందల సార్లు జానకి మా యింటికొచ్చింది. నాకూ జానకికీ కలిపి, అనేకసార్లు మా అమ్మ అన్నం తినిపించింది. అట్లాగే జానకి తల్లి కూడాను. పెళ్ళి అయిన తర్వాత కూడా చాలాసార్లు జానకి మా చెల్లెలితో ఆడుకోవటానికి కొచ్చింది. కాని ఆ రాకలకూ, దీనికీ మధ్య ఒక భేదం రేఖామాత్రంగా నేను చూడ గలుగుతున్నాను. దాన్ని విడమరిచి, స్పష్టీకరించలేక పోవటం నా అసమర్థత. వివిధాలోచనలతో బుర్ర నిండిపోయింది. కొన్ని క్షణాలపాటు నా ఆలోచ నలను నేను నవ్వుకున్నాను కూడానూ. అవి అంత సుందరమైన, అసంభవ మైన ఆలోచనలు మరి...

పార్కునుండి సరాసరి భోజనం చేసి వచ్చేటప్పటికి రాత్రి ఎనిమిది గంటలయింది. కుర్చీలో కూచుని చదువుకొంటున్నాను. విచ్చిన మల్లెపూల

లావణ్య సౌరభమూ, చిన్న అడుగుల చప్పుడూ వినిపించి వెనక్కు చూశాను. జానకి కొంచెం దూరంలో నిలబడి వుంది.

"మీరు రోజుకెన్ని సిగరెట్లు త్రాగుతారండీ ?" అన్నది జానకి నాకు దగ్గిరిగా వచ్చి మరొక కుర్చీని డ్రాయరు దగ్గరికి లాక్కొని లాంతరు వత్తి పెద్దదిచేసి.

దాదాపు యిరవై, ముప్ఫయ్‌లకు మధ్యగా వుంటుంటాయి."

జానకి యింకేమీ మాటాడలేదు. వెలుగుతున్న లాంతరువైపూ, దాని గ్లాసుకు కొట్టుకొని క్రింద పడిపోతున్న పురుగులవైపూ చూస్తోంది. కొన్ని నిమిషాలు నిశ్శబ్దంగానే గడిచినయ్... వున్నట్లుండి జానకి పెదిమలమీద చిన్న నవ్వు మెరిసింది. కళ్ళు లైటు వెలుతురులో తళ తళ లాడాయి. ముఖం కొద్దిగా జేవురించింది.

"కథలకూ, వాస్తవిక జీవితాలకూ సంబంధం వుంటుందని మీరు నమ్ముతారా ?" అన్నది జానకి నా వేపు చూడకుండానే.

"ఎందుకు నమ్మను ? కొన్ని కథలు ఎక్కువమంది జీవితానుభవాలై వుంటాయి. మరికొన్ని బహుకొద్దిమంది తత్వాలకే సరిపోయి వుండవచ్చు. నా దృష్టిలో ప్రపంచంలో ఏదీ అసంభవం కాదు. రెండువందల కోట్లమంది ప్రజల్లో ఎక్కడో అక్కడ, ఎప్పుడో అప్పుడు అవి జరిగే వుంటాయి. లేదా యికముందు జరగవచ్చు."

"మీరిచ్చిన నవల చదివాను" అన్నది జానకి నావేపు క్షణకాలం చూసి. కళ్ళు దించి మళ్ళీ లాంతరువేపు దృష్టి సారించి క్రింది పెదిమ బిగపట్టింది.

"అది సహజం. అటువంటి ప్రియురాళ్ళు అందరికీ దొరక్కపోవచ్చు. కానీ లేకపోలేదు. ఏ అదృష్టం వల్లనోకానీ అటువంటివాళ్లు లభించరు" అన్నాను కథను నెమరుకు తెచ్చుకుంటూ.

"అదృష్టం కూడా ఒక కారణమే అనుకోండి. కానీ ఆ అదృష్టాన్ని తెలుసుకోగల సమర్థత కూడా అవసరం" అని అరనిమిషం ఆగి "కదూ ?" అన్నది.

జానకివేపు చూశాను. అదే సమయంలో జానకి కూడా నావేపు చూసింది. పసిపిల్లవాడికీ సంపుసరుడికీ అర్థమయ్యే చూపులు అవి. ఇక నాకా?

కానీ...ఏమో ? నిజమో? అబద్ధమో ? ఏం అబద్ధమయితే ? నాకేం నష్టం? నేను ఆమె యింటి కెళ్ళలేదు. ఆమె నా యింటి కొచ్చింది. ఈ కారణం— పరిస్థితులు విషమిస్తే-విషమించవని నాకు తెలుసు. కొంత సహాయభూతంగా కూడా వుంటుంది అందులో నేను "మంచి"(!) వాడిననే వాడిక గ్రామంలో అమల్లో వున్నది. యింకా సందేహిస్తూ... నేను వీధివేపు చూశాను లేచి.

"నేను మీఅంత అశ్రద్ధ మనిషిని కాదు" అన్నది జానకి లేచి నుంచుని. జానకిని చూశాను. రకరకాల కాంతి పుంజాలు ఆమెలో సమీపించాయి. గొప్ప తుపాను హృదయంలో. ప్రళయ పవనానికి ఎగసిపడే సముద్రపు అలలవలె నెత్తురు పొంగు. హరికేన్ లాంతరు సాంద్రకాంతి. ఆకుపచ్చ చీర వెనక, చుక్కల కంచుకం రక్షణక్రింది స్నిగ్ధ సౌందర్యాలు, నన్ను చేతులెత్తి ఆహ్వానించి నట్లయింది. వెచ్చని శ్వాసతోపాటు ఊగే పీనపయోధరాలు... హృదయానికి దగ్గిరిగా...ఏవో లోకాలు, ఏవో గాంధర్వ నిక్వాణాఖండికలు నరాల్లో. యింద్ర ధనస్సుల మెత్తని కాంతిమీద, మబ్బుల నునుపు మెరుపుల మీద, ప్రయాణం చేస్తున్నట్లు. ఆమె సౌందర్య ప్రభలు, ఆ రాత్రి నా స్వాంతం ఆ గళ్ళపరుపుమీద, నిర్మానుష్యమైన ఆ యింట్లో, నీరసకాంతిలో.

ముహూర్త బలంలో బొత్తిగా విశ్వాసంలేని తరగతికి చెందినవాణ్ని నేను. గ్రహాల కలయికలవల్ల మంచి చెడుగులు కలుగుతాయని ఏనాడూ నమ్మనివాణ్ని. అటువంటి వాణ్నల్లా, జానకితో పరిచయం జరిగినప్పటి నుంచీ, నా భావాలను మార్చుకున్నాను. జానకికీ నాకూ సంబంధ మేమిటి ? మా కిద్దరకూ యిటువంటి సంబంధం కలుగుతుందని ఎవ్వరూ అనుకోలేరు. అందరి విషయం నాకు తెలీదు. నాకు మట్టుకు నాకు, కలలో కూడా ఇట్లా అని అనిపించలేదు. యిది ఏదో పూర్వజన్మ సుకృతం కాక మరేమిటి ? ఏమనుకోను...?

ఆ పరిచయం ఒకనాటితోనే తీరిపోలేదు. పోతుందని అనుకున్నాను. అందుకు విచారించాను కూడా. ఆమె ఏదో బలహీనత వల్లనే ఇందుకు ఒప్పుకుందేమో ? ఈ అనుమానం చాలా భాగం సబబేననిపించింది. ఇన్ని సంవత్సరాలనుంచి ఉంటున్నా, ఏనాడూ జరగని విషయం, ఈ నాడు ఈ పరిస్థితుల్లో జరిగిందంటే ఏమనుకోవాలి మరి ? ఇంతకంటే మంచి అవకాశాలు లోగడ ఎన్ని ఎదురు గాలేదు ? వాటినన్నింటినీ ఉపయోగించటం జరిగిందా ? ఇది మాత్రం నిజానికి ఏమంత అవకాశమని ? మనస్సుల్లో వాంఛబలం ఉండాలే

గానీ, అవకాశాలకేం కొదువ! లేకపోయినా ప్రయత్న పూర్వకంగానైనా సృష్టించుకోవచ్చు. అయితే అనేక ప్రణయ జీవితాలు కేవలం అవకాశాలు లేకనే నశించినయ్యని నేనూ ఒప్పుకుంటాను. జానకి కావాలని ఈ వీలును కలుగజేసింది. ఈ విషయం ఇప్పుడిప్పుడే నాకు స్పష్టం కాసాగింది. అయితే నన్ను కోరటంలోని అంతరార్థం నాకు బోధపడలేదు. ఇన్ని సంవత్సరాలూ నాలో మృగ్యమయి, ఇటీవల ధామ్మిన ఉద్భవించిన గొప్ప ఏమీ లేను. ఎందుకు కోరిందోనని బుర్ర బద్దలు కొట్టుకోవటం అనవసరం అనిపించింది. ఎందుకో కోరింది. దాన్ని నాకుగాను ఉపయోగ పెట్టుకోవటం కంటే ఉత్తమ మార్గం మరోటి లేదు. కారణాలతో నాకేం నిమిత్తం? కార్యం కావాలిగాని...!

ఇప్పటికి పది పదిహేను రోజులనుంచీ ఈ మధుర సంరంభ కార్యక్రమం మా యిద్దరిమధ్యా నిరాఘాటంగా సాగిపోతోంది. రాత్రి తొమ్మిది గంటలకు జానకి మా యింటికి వస్తుంది. తెల్లవారు ఝామున ఏ నాలుగింటికో వెడుతోంది. ఈ స్వర్గీయానందం ఏ క్షణాన ముగిసిపోతుందో, అట్లా జరగటం అసంభవమే కావచ్చు–జానకి శాశ్వతంగా నాతో యిట్లాగే ఉండటం సంభవమే అయితే ఇంతకంటే కావాలిసిందేముంటుంది?

ఈ సందిగ్ధంలో నేను ఎక్కువ కాలం కొట్టుకోకుండా జానకి ఒక తెరిపికి లాక్కు వచ్చింది నన్ను. మాటల సందర్భంలో ఆమె ఈ విషయాన్ని వెల్లడించింది.

"అయితే ఇక ఎప్పటికీ నువ్వు అత్తగారింటికి పోవా?" అన్నాను.

"ఊహుఁ పోను."

"నువ్వు పోకపోవచ్చు. పోవటం నీకు ఇష్టం కూడా లేకపోవచ్చు."

"మరి యింకెవరు పోతారు? అన్నది జానకి నా అసంపూర్ణ వాక్యం లోని వ్యంగ్యాన్ని అర్థం చేసుకుని నవ్వుతో.

"మన ఇష్టా ఇష్టాలతో ప్రసక్తి లేకుండానే లోకంలో అనేకం జరుగుతుంటాయి. అత్తగారింటికి పోవటం నీ కిష్టంలేనంత మాత్రాన, పోకుండా ఉండటం జరుగుతుందా? నీకు మల్లేనే మీ అమ్మ కూడా ఉంటుందనే నమ్మకమేముంది?"

"మా అమ్మ బలవంతాన పంపుతుందేమో నంటావు. అవునా?"

"ఎందుకు కాకూడదు ? లోకంలో ఇటువంటి కేసులు ఎన్ని జరగటల్లేదు. ఈ కోటాన కోట్ల సంసారాల్లోని భార్యలందరూ భర్తలతోటి మమకారంతో కాపరం చెయ్యటం లేదు. గతిలేక, తప్పుకొనే తోవ తెలీక, యిష్టంలేకపోయినా, మనస్సులో అసహ్యించుకొంటూనే, కాపరాలు నడిపిస్తున్నారు. మనం మాత్రం పొడిచి గెలిచిందేముంది ? అట్లాగే నీవు మాత్రం ఎందుకు జరగకూడదూ ?"

"వొట్టిది. మా అమ్మ ఏనాడూ అట్లా బలవంతం చెయ్యదు."

"మరి ఎంతకాలం నువ్విట్లా గడపగలుగుతావు ? ఈ రహస్యం ఈనాడు పైకి రాకపోవచ్చు. లేదని గట్టిగా అనేందుకు ఆధారాలేమీ లేవనుకో. రేపయినా నలుగురు నోళ్ళల్లోనూ పడక తప్పదు. ఆ నాడు ఈ జనం మీకు ఆపాదించే అవమానాన్నీ మీ అమ్మ భరిస్తుందా ? అంతదాకా అనవసరం. మనిద్దరికీ ఉన్న ఈ సంబంధం మీ అమ్మకు తెలిస్తే—ఇంకా నువ్వు నాకు దక్కుతావా ?" అన్నాను, జానకిని వొళ్లో కూచోబెట్టుకుని నావేపు తిప్పి, గుండెకు ఆనించుకుని, మొఖంలో ముఖం ఉంచి.

జానకి రెండు చేతులతోనూ నా ముఖాన్ని పట్టుకుని దగ్గిరిగా తీసుకుంటూ అన్నది. "ఇన్ని రాత్రిళ్ళు నేను ఇంటో ఉండకపోవటాన్ని గమనించలేనంత అమాయకత్వంలో మా అమ్మ ఉన్నదనుకున్నారా ?" అన్నది మెల్లిగా పెదిమలతో నాలోకి సంతోష వాహినులు ప్రవహింపచేస్తూ.

"అయితే ఈ విషయం మీ అమ్మకు తెలుసా ? ఈ పదిహేనురోజుల చరిత్ర మొత్తం ? తెలిసే ఊరుకుందా ?" అన్నాను ఆ మాటలు ఎట్లా నమ్మాలో తెలీక.

"శుభ్రంగా తెలుసు. ఆమె సమ్మతిమీదనే నేను మీ దగ్గిరికి వస్తున్నానంటే, మీకు ఆశ్చర్యంగా ఉందికదూ ?"

నేను పలకలేదు.

"ఏ తల్లికూడా కూతురు శోభను కళ్ళారా చూస్తూ సహించలేదు. తనలోంచి, రక్తంలోంచి, ఊహల్లోంచి, చీల్చుకుని, వచ్చి, తనకు, తన కోరికలకు ప్రతినిధిగా నిలబడ్డ కూతురు దైన్యాన్ని, ఏ తల్లీ సహించలేదు. ఆ బిడ్డ సౌఖ్యం కోసం, తల్లి గౌరవాన్నే కాదు, తనకు తనే త్యాగం చేసుకొంటుంది; తనలోని ఒక భాగమైన తన బిడ్డకోసం."

"అయితే నువ్వు తిరిగి ఎన్నడూ అత్తగారింటి కెళ్ళవన్నమాట."

"ఊఁహు. ఆ ఆశ ఏనాడో అంతరించింది. అన్ని ఆశలూ చచ్చిన తరువాతనే నేనీ నిర్ణయానికి వొచ్చాను" అన్నది, కొంచెం దిగులుగా మొఖం వంచి.

"ఇదంతా నా అదృష్టం. ఇంక నేనో చక్రవర్తిని. నువ్వో..."

"ఊఁ పోదురూ! అంతా కవిత్వం?" అన్నది జానకి. పొగడ్త తన కిష్టంలేనట్టు బుంగమూతి పెట్టి, నా చెంపమీద చిన్నదెబ్బ వేసింది.

"అందరూ సుఖపడటం ఎప్పుడూ జరగదేమో ననుకుంటాను జానకీ! ఈ విషయం నిన్నుబట్టి నిర్ధారణ చేసుకున్నాను. నీకూ నీ భర్తకూ ఏ విధమైన పొరపొచ్చెమూ రాకపోతే, నువ్వు, ఇన్ని అందాల మెరుగులతో ఇట్లా నాకు దొరికేదానివా? వాడు-ఆ పక్షిగాడు-ఇంత గొప్ప అప్సరస్సను నిన్ను ఒదులుకున్నాడు...నువ్వు పొరబాటే చేసి ఉండొచ్చు. కాదనను. కానీ ఏం? నువ్వెన్ని తప్పులు చేస్తేయేం? నువ్విచ్చే ఒక్క ముద్దుతో, ఒక్క చూపుతో, నీ ఆలింగనంలోని ఒక గొప్ప మగతలో ఎన్ని తప్పులనైనా మరిచిపోవచ్చునే." అన్నాను చమట జిగటకు, నుదురుకు అంటుకొన్న వెంట్రుకలను మెల్లిగా పైకి తోస్తూ.

"తప్పు కాదు. నే నేమీ చెయ్యలేదు కూడాను. ఆయనంటే నా కిష్టమే! నా ఇష్టంమీదనే ఆయన్ని చేసుకున్నాను. ఎన్నో స్వప్నాలు కన్నాను. ఎన్నో సౌధాలు భావజగత్తులో సృజించుకున్నాను. ఒక్క రాత్రితో అన్నీ ధ్వంసమయి, నామరూపాలు లేకుండా పోయినై" అన్నది జానకి. అటువంటి విషయంలోకి జానకిని ప్రవేశపెట్టినందుకు నాలో నేను చాలా నొచ్చుకున్నాను.

"ఊరుకో జానకీ! గతించినదాని కోసం విచారించటం అనవసరం" అని జానకిని ఊరటపెట్ట ప్రయత్నించాను. అయినా జానకి నా మాటలు వినిపించుకున్నట్లు లేదు.

"అప్పటికీ రెండు మూడు నెలలు నాలో రేగే కోరికలను బలవంతాన అణుచుకున్నాను. కానీ ఎంత కాలమని అట్లా గడపను? నా చుట్టూ, నా ఈడువాళ్ళు అనుభవిస్తున్న సౌఖ్యాలను తలచుకుని, లొట్టలు వేస్తూ జీవిత

కాలమంతా, ఈ చీకటి బాధల ముసురుతో ఎట్లా జీవించను? అందుకే ఆయన్ని ఒదిలి రావలసి వచ్చింది..."

జానకి ఇట్లా చెప్పుకుపోతున్నది. నాకే ఆత్రుత ఆగలేదు. ఏం? జానకి భర్తకేం? ఎటువంటివాడు? కావాలని, ఏరి కోరి చేసుకున్న అతన్ని ఒదిలి రావలసినంత ప్రగాఢ లోపాన్ని అతడేం కలిగి ఉన్నాడు? ఒకే ధోరణిలో చెప్పుకు పోతున్న జానకి విషాద చరిత్ర ప్రవాహానికి మధ్యలో అడ్డుతగిలి "అసలు విషయ మేమి"టన్నాను?

"ఏం చెప్పమంటారు? డబ్బు, అందం, చదువు ఎన్ని ఉంటేనేం? శరీర సౌఖ్యం అనుభవించే అవకాశం లేనప్పుడు. అవన్నీ లేకుండా ఇదొక్కటి ఉన్నా నేను బాధపడను. ఆయన..." అని చెప్పలేక, చెప్పలేక సిగ్గుపడుతూ చెప్పింది జానకి.

"బాగా చదువుకున్నవాడు. ఎందుకు, తగలెయ్యనా ఆ విజ్ఞానం? అటువంటి అసమర్థుడు, అసలు పెళ్ళి చేసుకోవటం ఎందుకు? లోకంవారి బిడ్డల గొంతులు బండకత్తితో కొయ్యటానికి తప్ప" అని ఊశాను జానకి భర్తను ఉద్దేశించి.

"ఆయన మీరనుకున్నంత మూర్ఖుడు కాడు. మొదట్లో ఆరోగ్యవంతుడే! నా పెళ్ళినాటికి వారిలో ఏ లోపమూ లేదట. కానీ నేను కాపరానికి వెళ్లేదాకా వారు ఉండలేదు. విపరీతంగా సుఖరోగ పీడితులయి—చివరకు..." అని జానకి చిన్నగా ఏడవటం మొదలు పెట్టింది.

జానకి చరిత్ర నా కళ్ళలో పలుకుతోంది బిగ్గరగా. ఆమె జీవితం ఎంతగా శిథిలమైపోయింది! దీనికి కారణం జానకి భర్త. అతగాడు విపరీతంగా ప్రవర్తించకపోతే, జానకికి ఈ గతి పట్టేదికాదు. హాయిగా ఈ అందాల రాశిని అనుభవించ గలిగేవాడు. ఇదంతా జానకి భర్త తప్పేననటంలో సందేహం లేదు...ఇట్లా ఆలోచించుకుంటూ పోతున్నాను. హఠాత్తుగా నా బుర్రలో మెరుపు మెరిసినట్లయింది, పిడుగు పడ్డట్లయింది. నా భార్య ఇంకా కాపరానికి రాలేదు. అందుకని నేను చిరుతిళ్ళకోసం దేబిరించటం కూడా జరుగుతోంది. రేపు నా భార్య కాపరానికొచ్చే నాటికి నేను కూడా కాదని ఎట్లా అనుకోవటం-ప్రత్యక్షంగా నిదర్శనం కనుపిస్తుంటే? అయితే జరిగేదేమిటి? ఈ ఊహాలకు నాకే భయమేసింది. ఇట్లా ఈ విధంగా కాదని

గ్యారంటీ ఏమిటి-నా జీవితం మట్టుకు ? నరాలు లాక్కు పోయినై. నెత్తురు చల్లబడింది. గుండె కొట్టుకోవటం ఆగిపోతున్నట్లుగా తోచింది. కాళ్ళలో సత్తువ పోయి, నిలబడలేక, వొణికి కూలబడ్డయ్. కళ్ళముందు తిమిరపుంజాలు భయంకరంగా ఘోషిస్తో సుడులు తిరుగుతున్నాయి. నా అంతర్గత వేదన బహిర్గతమయిందేమో ?

"ఏమిటండీ అయ్యో...ఏమిటండీ!" అన్నది జానకి నన్ను కదిలించి. జానకి కాదు. ఆమె స్థానంలో ఒక మహారాక్షసి, జుట్టు విరబోసుకుని, అగ్ని గుండం లాంటి నోరు తెరచుకుని, కాలపాశములవంటి హస్తాలను నా వేపు సాచుతున్నట్లు తోచింది. కేక పెట్టానేమో తెలీదు. "ఏమిటండీ" అని జానకి అంటున్న మాటలు నా చెవుల్లో సుడులు తిరిగి ప్రతిధ్వనిస్తున్నాయి. జానకికి ఏమని సమాధాన మిచ్చేది ?